క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సకు 38 మంది ఎంపిక



వృద్ధుడి కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యుడు

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలలో స్పందన అనే స్వచ్ఛంద సేవా సంస్థ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 58 మంది కళ్లను తనిఖీ చేసి, వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 38 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారికి శంకర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ, కనగల పారినాయుడు, బొత్స గణపతి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

మెంటాడ: మండలంలోని చామలాపల్లి గ్రామంలో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతున్నాయి. జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలు, మండల పరిషత్ నిధుల నుంచి రూ.6 లక్షలు మంజూరు కాగా, వాటితో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ బాయి తవుడమ్మ తెలిపారు.

8న కొండకెంగువ జాతర

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామంలో ఈ నెల 8వ తేదీన దేవుడిబాబు(నిత్యానందస్వామి) జాతర నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాదరావు, సర్పంచ్ కంచుపల్లి సుజాత ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. అదేరోజు విజయనగరం జానకీరామ్ బృందం వారిచే రేలారే రేలా ప్రదర్శన, బిందెల డ్యాన్స్, తప్పెటగుళ్లు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



రైతు సమర్పిస్తున్న అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

తెర్లాం: రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో 1433, 1434 ఫసలీలకు సంబంధించి, పిటిషన్ జమాబందీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారం నిమిత్తం పలువురు రైతులు సమర్పించిన వినతిపత్రాలను ఆయన స్వీకరించి, పరిశీలించారు. భూ సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.హేమంత్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు జి.సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శునకాలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని మారుతీనగర్, డోలపేట, తెలగ వీధి తదితర వార్డుల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకుని, వాటికి యాంటీ బర్త్/బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ గురువారం తెలిపారు. మొత్తం 68 కుక్కలను పట్టుకుని, ఆపరేషన్లకు తరలించామన్నారు.

వైభవంగా వాహన సేవ



ఆంజనేయస్వామికి వాహనసేవ నిర్వహిస్తున్న దృశ్యం

బొబ్బిలి: స్థానిక రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాంతర్గత కార్యక్రమంలో భాగంగా ఆంజనేయస్వామికి వాహన సేవ గురువారం నిర్వహించారు. వాహనంపై స్వామి వారిని కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

కంచరగెడ్డ జలాశయం.. పూర్తయ్యేదెప్పుడో?

- 20 ఏళ్లుగా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పూర్తికాని వైనం
- 480 ఎకరాలకు సాగునీటి సరఫరా ప్రశ్నార్థకం
- ఆందోళనలో రైతాంగం



కాశిందొరవలస వద్ద కంచరగెడ్డ జలాశయం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకం

బొబ్బిలిరూరల్:

ఆ ప్రాజెక్టు పూర్తయితే తమ పొలాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని ఆశిస్తున్న రైతులకు ఎప్పుడూ నిరాశే ఎదురవుతోంది. దాదాపు రెండు దశాబ్దాలుగా నిర్మాణ పనులు జరుగుతున్నా ఇప్పటికీ నిర్మాణం పూర్తికాకపోవడంతో సాగునీటి కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా నిర్మాణాన్ని వేగవంతం చేసి, సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదంతా బొబ్బిలి మండల పరిధిలోని కంచరగెడ్డ రిజర్వాయరు నిర్మాణం గూర్చి.. బొబ్బిలి మండలంతో పాటు రామభద్రపురంలోని రెండు గ్రామాల్లోని 480 ఎకరాల పంటపొలాలకు సాగునీరు అందించాల్సిన ఈ జలాశయం నిర్మాణం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలు మాత్రమే ఈ ప్రాజెక్టు పనుల కోసం నిధులు మంజూరు చేశారు. అయితే వారి పాలనా కాలాల మధ్యలో ఓసారి(2014) అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడంతో ప్రాజెక్టు పూర్తి కలగా మిగిలిపోయింది. ఇదే రైతులకు శాపంగా మారింది. ప్రస్తుతం కూడా చంద్రబాబు ప్రభుత్వమే అధికారంలో ఉండడంతో రిజర్వాయరు పూర్తయ్యేదెన్నడో అని రైతులు దీనంగా ఎదురుచూస్తున్న పరిస్థితి.



తుప్పు పట్టిన ప్రాజెక్టు షట్టర్లు

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే పనులు..

2004 సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి జలయజ్ఞం కార్యక్రమం ప్రారంభించారు. ఎక్కడెక్కడ సాగునీటి వనరులు ఉన్నాయో గుర్తించి, ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేశారు. ఇదే క్రమంలో కంచరగెడ్డ జలాశయం నిర్మాణం కూడా వెలుగులోకి వచ్చింది. కాశిందొరవలస దగ్గరున్న కంచరగెడ్డ జలాశయం పూర్తి చేసి రామభద్రపురం మండలంలోని గొల్లలపేట, అప్పలరాజు గ్రామాలతో పాటు బొబ్బిలి మండలంలోని కాశిందొరవలస, నారాయణప్పవలస, దొంగురువలస గ్రామాల్లోని రైతాంగానికి సంబంధించిన మొత్తం 480 ఎకరాలకు సాగునీరు అందించేలా కంచరగెడ్డ ప్రాజెక్టు ప్రారంభించారు. మొదట్లో రూ.3 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తే, ఆ నిధులను అప్పటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పట్లో విడుదల చేసిన నిధులతో జలాశయం చుట్టూ రాతిగట్టు, షట్టర్లు వంటి నిర్మాణా చేశారు. ఆ తర్వాత ప్రాజెక్టు కాలువలకు సంబంధించి, భూ సేకరణకు కసరత్తు జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టు కాలువల భూ సేకరణ పూర్తికాకపోవడంతో జలాశయ నిర్మాణ పనులు ముందుకు కదలలేదు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇలా..

రైతులకు కంచరగెడ్డ జలాశయం అవసరాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అప్పటి బొబ్బిలి ఎమ్మెల్యేగా ఉన్న శంబంగి వెంకట చినఅప్పలనాయుడు వివరించారు. దీంతో 2022లో రిజర్వాయరు నిర్మాణానికి రూ.2.53 కోట్లు మంజూరు చేసి, ప్రాజెక్టు నిర్మాణానికి మరోసారి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో శంకుస్థాపన చేయడం జరిగింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. రిజర్వాయరు పూర్తవుతుందని, సాగునీరు బాగా అందుతుందని నమ్మకం పెట్టుకున్నారు. ఆ తర్వాత ప్రాజెక్టు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రిజర్వాయరు కాలువల నిర్మాణానికి సంబంధించి, భూ సేకరణలో అవాంతరాలు రావడంతో సదరు ప్రాజెక్టు కాంట్రాక్టరు కేవలం 20 పనులు పూర్తి చేసి, ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నాడు. దీంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం కూడా ఈ నిర్మాణం పూర్తిపై దృష్టిసారించకపోవడంతో రైతాంగంలో ఆందోళన మొదలైంది. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి.. ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలలో నిర్మాణానికి జరిగిన చొరవ ఇప్పుడు కూడా తీసుకుంటే బాగుంటుందని రైతులు ఆశిస్తున్నారు.

భూసేకరణ చేయాల్సి ఉంది..

కంచరగెడ్డ ప్రాజెక్టుకు సంబంధించి, కాలువల నిర్మాణానికి భూసేకరణ చేయాల్సి ఉంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో 20 శాతం పనులు మాత్రమే జరిగాయి. పనులు ప్రారంభమైన తర్వాత మళ్లీ నిలిచిపోవడంతోనే నిధులు ఎక్కువగా అవుతున్నాయి. ఒకేసారి చకచకా పనులు జరిగితే తక్కువ నిధులతోనే ప్రాజెక్టు పూర్తవుతుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ నిర్మాణంపై ఏం చర్యలు తీసుకుంటుందో చూడాలి.

– శంబంగి సుధీర్, ఇరిగేషన్ ఏఈ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం ఫీడర్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. విద్యుత్ తీగలను ఆనుకుని ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో చినరాజులగుమ్మడ, పెద రాజులగుమ్మడ, వీవీఆర్ పేట, జేకేగుమ్మడ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అసౌకర్యానికి చింతిస్తున్నామని, బాధిత గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

బొబ్బిలి: మండలంలోని కలువరాయి, బొబ్బిలి, బలిజిపేట, గ్రోత్ సెంటర్ ఫీడర్‌ల పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఈఈ ఎ.అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

పల్లెపండుగ పనులపై సమీక్ష

రామభద్రపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పల్లెపండుగ అభివృద్ధి పనులపై పంచాయతీరాజ్ డీఈఈ వి.అప్పారావు గురువారం సమీక్షించారు. గ్రామగ్రామాన జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ప్రతీ పనికి సంబంధించి, ఖర్చు వివరాలతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. నియోజకవర్గంలో రూ.28 కోట్లతో 405 పనులు మంజూరయ్యాయని, వీటిలో 272 పనులు పూర్తయ్యాయన్నారు. మొత్తం రూ.13 కోట్ల బిల్లులు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.2.50 కోట్లు బిల్లులు వెండర్ల ఖాతాలకు జమయ్యాయన్నారు. ఇంకా రూ.10.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి జమదగ్ని

తెర్లాం/బాడంగి: మామిడి సాగులో అధిక దిగుబడులకు పూత దశ నుంచే సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి ఏవీఎస్‌వీ జమదగ్ని అన్నారు. తెర్లాం మండలంలోని పెరుమాళి గ్రామంలో రామభద్రపురం ఉద్యానశాఖ అధికారి మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మామిడి పంటలో పూత దశలో ఎటువంటి తెగుళ్లు సోకుతాయి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మామిడి తోటల్లో 8 నెలల పాటు చేసే సస్యరక్షణ చర్యల కన్నా పూత దశలో చేపట్టిన సస్యరక్షణ చర్యలే మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. విజయనగరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసురాజు మాట్లాడుతూ మామిడి తోటల్లో పూత దశలో పాటించే యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలే పంట దిగుబడి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మామిడి రైతుల ఉత్పత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు జి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయాలి



రేగిడి: సంకిలిలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి/సంతకవిటి/తెర్లాం: మండలాల్లోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవోలు గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తేనే రోజుకు రూ.300 వేతనం లభిస్తుందన్నారు. రోజుకూ రెండు పూటలా వాతావరణం చల్లగా ఉన్న సమయంలోనే పనులు చేసుకోవాలని తెలిపారు.

చేపపిల్లల విడుదల



చెరువులోకి చేపపిల్లలు విడిచిపెడుతున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామ చెరువులోకి చేపపిల్లలను ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం విడుదల చేశారు. మత్స్య సంపదను వృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే చేపల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 36 చెరువుల్లోకి 2.18 లక్షల చేపపిల్లలను విడిచిపెట్టామన్నారు.



తెర్లాం: చెరువులోకి చేపపిల్లలు విడిచిపెడుతున్న ఎంపీడీవో రాంబాబు

కార్యక్రమంలో మత్స్యకార సంఘ అధ్యక్షుడు కంచి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో అధిక ఆదాయం

తెర్లాం: గ్రామాల్లోని చెరువుల్లో చేపల పెంపకం ద్వారా పెంపకందారులు అధిక ఆదాయం పొందవచ్చని ఎంపీడీవో రేగి రాంబాబు అన్నారు. మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలోని చెరువులో చేపపిల్లలు విడిచిపెట్టే కార్యక్రమం గురువారం చేపట్టారు. గ్రామాల్లోని చెరువుల్లో చేపలు పెంపకం చేసేందుకు పెంపకందారులు ముందుకురావాలన్నారు. అనంతరం చేపల పెంపకానికి తీసుకోవాల్సిన సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచి కలిగిన భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా రుచి, శుచికరమైన భోజనాలు పెట్టాలని ఎంఈవో త్రినాథరావు సూచించారు. మండలంలోని నందిగాం జెడ్పీ హైస్కూల్‌ను ఆయన గురువారం సందర్శించారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల చేతిరాత పుస్తకాలను పరిశీలించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని, మెనూ అమలులో లోపాలు ఉంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బొబ్బిలి: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి గురువారం పర్యటించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు ఆమె సూచించారు. ప్రధాన వీధులు, కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని తెలిపారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని, పారిశుధ్యంపై ప్రజలను అవగాహన కల్పించాలన్నారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

బొబ్బిలి: రేషన్ సరుకుల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలని, తూకంలో తేడాలు ఉండకుండా చూడాలని ఉప తహసీల్దార్ రెడ్డి సాయికృష్ణ ఆదేశించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో జరుగుతున్న బియ్యం తదితర నిత్యావసర సరుకులు(రేషన్) పంపిణీని ఆయన గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. సకాలంలో రేషన్ పంపిణీ పూర్తి చేయాలన్నారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలి

బాడంగి: మండల వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్న డీవార్మింగ్ డే(నులిపురుగుల నివారణ దినోత్సవం)ను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి కన్వర్జెన్సీ సమావేశం గురువారం నిర్వహించారు. మండలంలో మొత్తం 5,410 మంది విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్న భోజనం చేసిన అరగంట తర్వాత ఈ మాత్రలను విద్యార్థులతో మింగించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొద్దాం గ్రామ సచివాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ సర్వేలు పూర్తి చేయాలని, సమయానికి విధులకు హాజరుకావాలని తెలిపారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి, రంగరాయపురం గ్రామాల సచివాలయాలను ఎంపీడీవో పప్పు రవికుమార్ గురువారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరై, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

దారంతా గుంతలే..



రేగిడి మండలంలోని ఉంగరాడమెట్ట, మజ్జిరాముడుపేట జంక్షన్‌ల వద్ద పాలకొండ-రాజాం ప్రాంతాల ప్రధాన రహదారి చాలా అధ్వానంగా తయారైంది. దారి పొడవుగా గుంతలతో అస్తవ్యస్తంగా ఉంది. రాళ్లు తేలిన ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

– రేగిడి

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



వంగర మండలం, కింజంగి గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. గ్రామ ఆర్అండ్ఆర్ కాలనీలో కొత్తగా నిర్మించిన శ్రీకోదండరామ ఆలయ ప్రారంభోత్సవం గురువారం అట్టహాసంగా జరిగింది. వేదపండితులు ఆరవెల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గురుస్తోత్రం, ప్రతిష్ఠా సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాసూత్రధారణ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

– వంగర

సంక్షిప్తంగా...

19న గాయత్రీదేవి యాత్రా మహోత్సవాలు

రాజాం: స్థానిక గాయత్రి కాలనీలో ఈ నెల 19వ తేదీన గాయత్రీదేవి ఆలయ 32వ వార్షిక యాత్రా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు కొండపేటి తేజోమూర్తి, వివేకానందరావులు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

రేషన్ సరుకుల్లో కోత తగదు

వంగర: నిరుపేదలకు అందిస్తున్న రేషన్ సరుకుల్లో కోత తగదని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడిన ఆయన.. రాజాం నియోజకవర్గం అంతటికీ సివిల్ సప్లయి గొడౌన్ ఇన్‌చార్జి ఒక్కరే ఉన్నందున వ్యవస్థలో లోపాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ప్రతినెలా పేదలకు అందించే బియ్యం, ఇతర సరుకులను సక్రమంగా అందివ్వాలని కోరారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 36వ వార్షికోత్సవంతో పాటు స్వామి వారి కల్యాణ మహోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పనస రమణనాయుడు, పనస చంద్రకళ గురువారం తెలిపారు. ఏటా మాఘశుద్ధ దశమి రోజున ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి రైతు సేవా కేంద్రంలో భూ ఆధార్ రిజిస్ట్రేషన్‌ల ఆన్‌లైన్ విధానంపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతీ రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏడీ మజ్జి శ్యామసుందర్ తెలిపారు. భూ ఆధార్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే భవిష్యత్‌లో విత్తనాలపై రాయితీ తదితర సదుపాయాలు వర్తిస్తాయన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో మజ్జిగౌరి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పులఖండం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా మరడాన ధనుంజయనాయుడు, అధ్యక్షుడిగా యర్రారపు సూర్యరావు, ఉపాధ్యక్షులుగా అల్లాడ జయప్రకాష్, శంబంగి గణపతిరావు, ప్రధాన కార్యదర్శిగా పిరిడి మహేశ్వరరావు, కోశాధికారిగా పొట్టా బంగారుబాబు, సహాయ కోశాధికారిగా బొంగు అప్పలనాయుడు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.సతీష్, వై.సింహాచలం, వై.జ్యోతి, బి.గణపతిరావు, కె.ముజీబ్ తదితరులు ఎంపికయ్యారు.

తుంపర సేద్యంతో నీటి ఆదా

రేగిడి: తుంపర సేద్యంతో నీరు ఆదా అవుతుందని ఏవో మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, సోమరాజుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో తుంపర, బిందు సేద్యానికి ప్రభుత్వం రాయితీపై పైపులు అందిస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కోసం రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లోని 4 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని బూరాడ, సోమరాజుపేట, లక్ష్మీపురం, ఖండ్యాం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన గురువారం సందర్శించి, పలు సూచనలు చేశారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేసి పెట్టాలన్నారు.

టీబీ రహిత భారత్ లక్ష్యం

రేగిడి: టీబీ రహిత భారత్ లక్ష్యంగా మండలంలోని ఖండ్యాం గ్రామంలో క్షయవ్యాధి(టీబీ) నిర్మూలనపై గురువారం నిర్వహించారు. ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్.. వ్యాధి లక్షణాలు, వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం టీబీ నివారణకు కృషి చేస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.